ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 1 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# పాదాలను తాకి.. తుపాకీతో కాల్పులు

దీపావళి రోజున తూటాలకు ఇద్దరు బలి..!

ఢిల్లీ : దీపావళి రోజున దేశ రాజధాని ఢిల్లీలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. షహదారా ప్రాంతంలో తుపాకీ తూటాలకు ఇద్దరు బలయ్యారు. మరో మైనర్ గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫార్స్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ కాల్పుల ఘటన చోటు చేసుకున్నది. మృతులు ఆకాశ్ (40), రిషబ్ (16) మృతి చెందగా.. క్రిష్ శర్మ (10) గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. షహదారా ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో బిహారీ కాలనీలో కాల్పులు జరిగినట్లు పీసీఆర్ కాల్ వచ్చిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆకాశ్, అతడి




మేనల్లుడు రిషబ్, కొడుకు కుమారుడు క్రిష్‌కు గాయాలయ్యాయన్నారు. తీవ్ర గాయాలతో ఆకాశ్, రిషబ్ చనిపోయారని చెప్పారు. ప్రాథమిక విచారణలో ఐదురౌండ్లు క్పాలు జరిగినట్లుగా తేలింది. గుర్తు తెలియని వ్యక్తి తుపాకీ కాల్పులు జరిపే ముందు పాదాలను తాకాడు. ఆ తర్వాత కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆకాశ్ శర్మ పక్కనే ఉన్న రిషబ్, క్రిష్‌కు సైతం తూట గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించగా.. ఆకాశ్ శర్మ, రిషబ్ చనిపోయినట్లుగా వైద్యులు ప్రకటించారు. క్రిష్ శర్మ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కాల్పులకు కారణాలు తెలియరాలేదు.

## ట్రాన్స్ కోకు

# రూ.4,701 కోట్లు విడుదల

**2024 నవంబరు నుంచి 2025 మార్చి తాలూకా.. ఉత్తర్వులను జారీచేసిన ప్రభుత్వం**

హైదరాబాద్, ప్రజాస్వరం : ట్రాన్స్ కోకు ప్రభుత్వం తీపికబురు అందించింది. విద్యుత్ సబ్సిడీ నిధులను మంజూరు చేసింది. రూ.4,791 కోట్ల సబ్సిడీ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. 2024 నవంబరు నుంచి 2025 మార్చి వరకు నిధులు విడుదల చేస్తూ ఉత్వర్వులు ఇచ్చింది.



## చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు

# రాజ్ పాకాల

విజయ మద్దూరి కూడా

డ్రగ్స్ కోణాలపై విచారణ

ఇప్పటికే విడివిడిగా విచారించించిన

మోకిలా పోలీసులు





హైదరాబాద్, ప్రజాస్వరం : జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు వేగం పెంచారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిలను చేవేళ్ల ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నారు. పాకాల ఇంట్లో జరిగిన పార్టీలో డ్రగ్స్ కోణాలపై ఆరా తీసుకున్నట్లు తెలుస్తోంది. మద్దూరి ఫోన్ కు సంబంధించి కూడా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

ఈ కేసులో ఇది వరకే మోకిలా పోలీసులు వీరిద్దిని విడివిడిగా దర్యాప్తు చేశారు. దీనికి కొనసాగింపుగా శుక్రవారం చేవేళ్ల పోలీసులు పోలీసులు నిందితులను విచారిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం జన్వాడ మండలంలో అక్టోబర్ 26న కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందిన ఫామ్ హౌస్లో పార్టీ జరగడం తెలిసిందే. దీంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ ముమ్మరం చేశారు.



# పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర

19 కిలోల ఎల్పీజీ సిండర్‌పై రూ. 62ల పెంపు

హైదరాబాద్ లో రూ. 2028లు

న్యూఢిల్లీ: దీపావళి పండుగ వేళ దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఇప్పటికే పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులపై మరో భారం మోపింది. పెట్రో ధరలు తగ్గుతాయంటూ లీకులిస్తూ వస్తున్న బీజేపీ సర్కార్.. గ్యాస్ సిలిండర్ ధరను మాత్రం పెంచింది. వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల ఎల్పీజీ సిండర్‌పై మరో రూ.62 బాదింది. దీంతో ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1802కు చేరింది. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని దేశీయ చమురు కంపెనీలు ప్రకటించాయి. అయితే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధర జోలికి మాత్రం వెల్లక పోవడం కాస్త ఊరటనిచ్చే అంశం. తాజా పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ ధర రూ.2028కి పెరిగింది.

# మూసీకి రేపో మాపో టెండర్లు

గండిపేటలో గోదావరి నీళ్లు నింపేందుకు ..

మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్ సాగర్‌కు నీటిని తరలింపునకు ప్రణాళికలు

ఫస్ట్ ఫేజ్‌ను నాలుగైదు నెలల్లో పూర్తి?

**హైదరాబాద్, ప్రజాస్వరం : మూసీ పునరుజ్జీవనకు తాము అడ్డంకి కాదని, అక్కడి ప్రజలకు న్యాయం చేయాలన్నదే తమ ఆలోచనగా చెప్పుకొచ్చారు. ఓ వైపు అధికారులతో వరసగా సమీక్షలు చేస్తున్నారు సీఎం రేవంత్. గండిపేటలో గోదావరి నీళ్లు నింపేందుకు టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. రెండు వారాల్లో టెండర్లను పిలవనుంది తెలంగాణ ప్రభుత్వం.** తొలి దశలో గండిపేట నుంచి బాపూఘాట్ వరకు పనులు చేపట్టనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా బాపుఘాట్‌ను సుందరీకణపై దృష్టి పెట్టింది. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ప్రపంచంలో అతిపెద్ద గాంధీ విగ్రహం పెట్టాలని ఆలోచన చేస్తోంది. ఈ వారంలో దీని కోసం టెండర్లు పిలవాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇక మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్ సాగర్‌కు నీటిని తరలించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. మొత్తానికి ఫస్ట్ ఫేజ్‌ను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని భావిస్తోంది.



# దేవిరమ్మ జాతరలో తొక్కిసలాట

కొండపై నుంచి కిందకు జారిపడిన వందల మంది

పలువురికి గాయాలు

బెంగళూరు : కర్ణాటకలోని చిక్‌మంగుళూరులో విషాద ఘటన చోటుచేసుకుంది. మాణిక్య ధార కొండపై ఉన్న దేవిరమ్మ జాతరకు వేలాది మందికి పైగా భక్తులు పోటెత్తారు. ఎత్తులో ఉండే అమ్మవారిని దర్శించుకోవాలంటే కిలోమీటర్ల కొండను ఎక్కాల్సిందే. చలికాలం కావడంతో అమ్మవారి కొండను పొగమంచు పూర్తిగా కమ్మేసింది. భక్తులు కూడా పరిమితికి మించి భారీగా రావడంతో.. తొక్కిసలాట జరిగింది. దీంతో కొండపై నుంచి వందలమందికి పైగా కిందకి జారిపడ్డారు.



పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని భక్తులను రక్షిస్తారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. చిక్‌మంగళూరులో కొండమీద కొలువై ఉన్న బిండిగ దేవీరమ్మ నరక చతుర్ధశి నాడు భక్తులకు దర్శనమిస్తుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మందికి పైగా భక్తులు కొండ మీదకు పోటెత్తారు. రాళ్లు, ముళ్లు ఉన్న దారిలోనే చెప్పులు లేకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్లారు. అయితే సముద్ర మట్టానికి 3000 ఎత్తులో ఉండే ఈ కొండపై రాత్రికి భక్త జనం అధికమయ్యారు.



ఆంధ్ర.. సంక్రాంతిలోపు

# ఉచిత ప్రయాణం

ఏపీ మంత్రి జనార్దన్ రెడ్డి

**అమరావతి** : ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. సంక్రాంతి పండుగలోపు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇప్పటికే పెన్షన్లను పెంచామని, ఈరోజు నుంచి దీపం పథకం ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఎన్నో పరిశ్రమలు తీసుకువస్తున్నామన్నారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్టులో

# డ్రగ్స్ స్వాధీనం

7 కిలోల హైడ్రోఫాలిక్ విలువ రూ. 7 కోట్లు .. ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, ప్రజాస్వరం: శంషాబాద్ విమానాశ్రయంలో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 7.096 కిలోల హైడ్రోఫోలిక్ వీడ్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## రోడ్డు పక్కన విగతజీవులై..

# ఉత్తరప్రదేశ్ లో ఇద్దరు పిల్లలు మృతి

క్షుద్రపూజల కోసం చంపినట్లు తల్లిదండ్రుల అనుమానం

రహదారి దిగ్బంధించి నిరసన

**లక్నో: ఇద్దరు పిల్లలు అనుమానాస్పదంగా మరణించారు. గుడికి వెళ్లిన వారిద్దరూ రోడ్డు పక్కన శవాలుగా కనిపించారు. దీంతో క్షుద్రపూజల కోసం ఆ చిన్నారులను చంపి ఉంటారని తల్లిదండ్రులు అనుమానించారు. రహదారిని దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దేవ్‌బంద్ పరిధిలోని భయాల్ గ్రామానికి చెందిన 11 ఏళ్ల దేవ్, బంధువైన 9 ఏళ్ల మహి కలిసి గురువారం గ్రామ శివారులోని గుడికి వెళ్లారు.**

కాగా, ఆ ఇద్దరు పిల్లలు రాత్రి వరకు ఇంటికి తిరిగిరాలేదు. దీంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పిల్లల కోసం అన్ని చోట్ల వెతికారు. అర్ధరాత్రి వేళ రోడ్డు పక్కన పిల్లల మృతదేహాలు కనిపించాయి. దీంతో క్షుద్రపూజల కోసం తమ పిల్లలను చంపి ఉంటారని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో కలిసి రహదారిని దిగ్బంధించి నిరసన చేపట్టారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆధారాల సేకరణ కోసం ఫోరెన్సిక్ బృందాలను రప్పించారు. పిల్లల శరీరంలోని ఎముకలు విరిగినట్లు గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో వారు మరణించి ఉంటారని పోలీసులు అనుమానించారు. చిన్నారుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు పిల్లల మరణంపై కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారి వెల్లడించారు.

## కెనడాలో భారీ డ్రగ్స్ రాకెట్

# గుట్టురట్టు

**భారత సంతతి వ్యక్తి అరెస్టు**

**తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇంకా పలు ఆయుధాలు, 5 లక్షల డాలర్ల నగదు గుర్తింపు**

ప్రపంచం: కెనడాలో భారీగా డ్రగ్స్ గుట్టు రట్టయింది. వాంకోవర్ పరిధిలో అక్రమంగా నడుపుతోన్న ల్యాబ్‌ను పోలీసులు గుర్తించారు. ఈక్రమంలో జరిపిన సోదాల్లో మాదక ద్రవ్యాలతో పాటు పలురకాల రసాయనాలు, ఆయుధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారత సంతతికి చెందిన గగన్‌ప్రీత్ సింగ్ రంధవాను అరెస్టు చేశారు. ఈ సోదాల్లో భాగంగా కెనడా పోలీసులు కేజీలకొద్దీ ఫెంటానిల్, మెథాంఫెటమైన్, కొకైన్, ఎండీఎంఏ వంటి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ప్రాణాంతక రసాయనాలున్నాయని తెలిపారు. వాటితో పాటు తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇంకా పలు ఆయుధాలు, 5 లక్షల డాలర్ల నగదును గుర్తించారు. అక్రమంగా ఆయుధాలను కలిగిఉండటం, డ్రగ్స్‌కు సంబంధించి రంధవా పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడని తెలిపారు. ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయనున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా డ్రగ్స్ ఉత్పత్తి, సరఫరా చేస్తోన్న గ్రూప్‌ను కొన్ని నెలలపాటు దర్యాప్తు అనంతరం విచ్ఛిన్నం చేయగలిగామని వెల్లడించారు. వీరికి అంతర్జాతీయంగా సంబంధాలు ఉన్నాయన్నారు.